# ఆకర్షణ

అటు అదివరకు చాలా తడవలు వెళ్ళాడు - పని వుండిగాని, లేకగాని. ఆ వేళ మాత్రం కాస్త భయం వేసింది. కారణం లేకపోలేదు. కాస్త పొద్దు పోయింది. సన్నగా తుప్పర రాలుతోంది. బజారంతా నిర్మానుష్యంగా ఉంది. వీధి దీపాల కాంతికి అడ్డంగా చెట్లనీడలు దెయ్యాలల్లే కదులుతున్నాయి. చంద్రశేఖరం భయ నివృత్తికోసం అనవసరంగా క్రాపు సర్దుకొని సిగరెట్ వెలిగించి ఒకసారి గట్టిగా నవ్వి ధైర్యాన్ని కూడదీసుకున్నాడు. అతనికింకా వివాహం కాలేదు. తండ్రి వొదిలి పెట్టిన ఆస్తీ, వ్యాపారమూ చల్లగా వున్నాయి. జేబునిండా డబ్బు, పొంగే యవ్వనమూ.

అతడు ఆ బజారులోని 22వ నెంబరు యింటి ముందు ఆగి సరిగ్గా మూడుసార్లు తలుపుమీద తట్టాడు. ఐదు నిమిషాల తర్వాత ఓ ముసలమ్మవచ్చి తలుపు తీసింది. చంద్రశేఖరం ఆమె ననుసరించి వెళ్ళాడు లోపలికి. యిప్పటికి అతని గుండె కుదుటపడింది. అతడు లోపలివైపంతా ఓసారి కలియజూచి ''అది వొచ్చిందా?'' అని అడిగాడు.

ముసలమ్మ సమాధానం చెప్పకముందే ఎడంవేపు గదినుంచి ఓ పదిహేడేళ్ళ యువతి బయటికొచ్చింది. శోభాయమానంగా వెలుగుతూ ఉన్న ఎలక్ట్రిక్‌లైటు కాంతిలో ఆ అమ్మాయి శోభ మరింతగా కనిపిస్తోంది. ఆమె చిరునవ్వు నవ్వి ''రారేమో అనుకున్నాను. ఇంత పొద్దు పోయిందేం యివ్వాళ?'' అంటూ యెదురు వచ్చింది అతనికి.

''కాస్త పనివుండి ఆగిపోయినాను శశీ!'' అంటూ చంద్రశేఖరం ఆమె భుజంమీద చెయ్యివేసి గదిలోకి తీసుకెళ్ళాడు.

ఆ గది అదివరకే అతనికి పరిచయమైనా ఆ వేళ ఎందుకో చాలా అందంగా కనిపించింది. కొత్త కొత్త పరిమళాన్ని మోసుకు వస్తున్న చల్లగాలి అతన్ని ఉత్తేజ పరిచింది. లెవండర్ సువాసనలు వెదజల్లుతున్న ఆమె జుట్టు చేత్తో సవరిస్తూ అతను పేము కుర్చీలో కూర్చుని ఆమెని వొళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. ''శశీ, శశీ!'' అని పిల్చాడు మెల్లిగా ఆమె మొహం దగ్గిర తన మొహం పెట్టి.

ఆమె వెన్నెల కాసినట్టు నవ్వింది. ''నే నిక్కడే వున్నా' నంది అతని నొక్కుల క్రాపుసర్దుతూ.

''నువ్వింత దగ్గిరలో ఉన్నా, ఇంకా ఈబాధ పోదేమిటి శశీ!'' అంటూ చంద్రశేఖరం ఆమె రక్తవర్ణపు పెదాల మీద వెచ్చగా ముద్దెట్టుకున్నాడు.

''అదంతా నీ పిచ్చి'' అంది కిలకిల నవ్వుతూ ఆమె. పచ్చకర్పూరం వాసన వేసింది ఆమె నవ్వు. గాలి కిటికీ గుండా స్వర్గంనించి ఆనందాన్ని మోసుకువస్తోంది. ఆ యవ్వనులకోసం.

''శశీ!''

'' ఏమిటో చెప్పు.''

''వెన్నెల, వాన, చీకటి అన్నీ అందంగానే వుంటాయి పక్కన నువ్వుంటే.''

''నీదంతా కవిత్వం.''

''కాదు - నిజం.''

ఆమె మెల్లిగా లేచి మంచంమీద పడుకుంది ఒయ్యారంగా వొళ్ళు మెక్కి విరుచుకుంటూ. చంద్ర శేఖరం అక్కడేకూర్చుని ఆమెని కళ్ళతో ఫోటో తీసుకుని దాచుకుంటున్నాడు మనసులో

''అబ్బ! అట్లా చూడకండి- నాకెట్లాగో ఉంటుంది'' అంది శశి.

చంద్రశేఖరం, ఆమె దగ్గిరకి వచ్చినుంచుని ''ఇవ్వాళ తెల్లారేదాకా ఉంటావా, వెళ్ళిపోతావా?'' అంటూ ఆమె పక్కనే మంచంమీద వాలాడు.

''తెల్లారేదాకానే! ఇంకో గంటన్నరకల్లా వెళ్ళి పోవాలి. నేనేమన్నా..... అనుకున్నారేం కొంపతీసి ....?'' అంది శశి అతన్ని వెచ్చని కౌగిట్లో బిగిస్తో. ఆ స్వర్గానందంలో తన్మయుడవుతూ అతడు, ''ఈ సుఖం, అనంతమూ, శాశ్వతమూ కాగూడదూ?'' అన్నాడు.

''పాపం.... ఎంతాశే'' అంది శశి.

ఈ ప్రణయం అప్పటికి నాలుగునెలల క్రితం నించీ సాగుతున్నా, చంద్రశేఖరానికి తన ప్రియురాలెవరో పూర్తిగా తెలియదు. ఆమె ఎవరో, మంచి స్థితిగల కుటుంబ స్త్రీ అని మాత్రం వూహించుకున్నాడు. ఆమె పేరు శశి అని ఆమె చెప్పటము ఋజువు. ఇంకొకటి, ఆమె అతని దగ్గిర ఎన్నడూ దమ్మిడీ పుచ్చుకోలేదు. ఆ యింటామెకు మాత్రం అతను అప్పుడో పది, అప్పుడో పదిహేనూ ఇచ్చాడు. శశి రాత్రి పన్నెండున్నరకి అతనితో కలిసి, ఊళ్లోకి కొంతదూరం వచ్చి తర్వాత విడిపోయింది పోలేక పోలేక.

వరసగా నాలుగురోజులు, చంద్రశేఖరం అటు వేపు వెళ్ళలేకపోయినాడు తన పెళ్ళి హడావుడితో. పెళ్ళి కాకముందే అంతా హడావుడీను. ఐదో రోజున శశి దగ్గరకు వెళ్ళాడు.

''నాలుగు రోజుల్నించీ తీరనేలేదా?'' అంది శశి నిష్ఠూరంగా, ఆమె ఆవేళ చాలా అందంగా అలంకరించుకు వొచ్చింది. ఆకాశ నీలపు రంగు సిల్కు చీరె, ఆకుపచ్చని రవిక, మల్లెపూలు, గదంతా మల్లెపూల సువాసనతో ఘుమ ఘుమ లాడుతోంది.

''చెబితే కోప్పడతావు మరి'' అన్నాడు ఆమె గడ్డం కింద చెయ్యి పెట్టి బుజ్జగిస్తూ.

''నా కోపం ఏం చేస్తుంది మిమ్మల్ని? చెప్పండి...'' అంది మంచంమీద కొంచెం జరిగి అతనికి స్థలం ఇస్తూ.

''ఆ పక్కన ఏదో పల్లెటూర్లో నాకు పిల్లని మాట్లాడారు మా వాళ్ళు. వంశక్షేమం కోసం నేను పెళ్లి చేసుకోవాలి.'' అన్నాడు నవ్వుతూ అతను.

''పిల్లని చూశారా?'' అని అడిగిందామె కొంచెం జలసీతో బుంగమూతి పెట్టి.

''అదిగో, అలా మూతి పెడితే నాకు కొరక బుద్ధవుతుంది. పిల్లని చూడలేదులే. అది ఎలా వున్నా బాధలేదు. సుబ్బలక్ష్మి అట పేరు. ఎవరో ఒకతె పెళ్ళామంటూ ఉంటే, వంటకీ దానికి ఇబ్బంది ఉండదు. చూడు, ఏ వేళకి పోయినా తలుపు తీస్తూ ఉంటుంది'' అని పెద్దగా నవ్వాడు చంద్రశేఖరం.

శశికూడా నవ్వి ''మీకు భార్య అంటేఎంత విలువండీ! అది సరేగానండీ - నేనూ పెళ్లి చేసుకుంటానను కోండి మీ కిష్టమేనా?'' అని అడిగింది అతని ఒళ్ళో పడుకుని.

చంద్రశేఖరం నవ్వలేదుగాని, ''ఒద్దంటానికి నేనెవణ్ణిగాని, అందులో నీకు కొంత సుఖంవుంది, ఇబ్బందీ ఉంది. నీకు పుట్టే పిల్లలకి సాంఘికరక్షణ ఉంటుంది...'' అని ఆపేశాడు నవ్వి.

శశి అతన్ని ఆపైన మాట్లాడనివ్వకుండా ముద్దులతో నింపేసింది.

చంద్రశేఖరం శుభలేక ఒకటి శశి కిద్దామని పది రోజుల్నించీ ప్రయత్నించికూడా, ఆమె అక్కడికి రాక పోవడంవల్ల కుదరలేదు. తల్లీ, చెల్లెలూ పెళ్ళికూతుర్ని చూసి వచ్చారు కాని, అతను పోలేదు. కారణం ఎవరైతే ఏమనే నిర్లక్ష్యమే. పిల్లబాగానే ఉందిట. ఈడూ, జోడూ అని వాళ్ళు అభిప్రాయపడ్డారు.

పెళ్ళికి ముందురోజు అంతా పల్లెటూరు వెళ్ళారు. చంద్రశేఖరం, తన మామగారి ఐశ్వర్యానికి ముగ్ధుడయినాడు. అదీగాక తనభార్య చెల్లెల్ని చూసి తన భార్య మంచి అందకత్తే అని ఊహించుకొని కొంచెం తృప్తిగూడా పడ్డాడు.

పెళ్ళిరోజు తెల్లారకట్ట ముహూర్తం. నిద్రకళ్ళతో చంద్రశేఖరం. పెళ్ళిపీటల మీద మొదటిసారిగా తన కాబోయ్యే అర్ధాంగిని చూశాడు. కళ్ళు నులుముకుని తేలు కుట్టిన వాడిలా మళ్ళీ చూశాడు. ఆ అమ్మాయి కూడా అల్లాగే చూసింది. తనకేమీ తోచడంలేదు. పురోహితులు మంత్రోచ్చారణ చేస్తూ, ''ముహూర్తం సమీపిస్తోంది'' అని మంగళసూత్రం అతని చేతికిచ్చారు.

అతని మనస్సులో బాధతో కూడిన తుఫాను వీస్తోంది. తనతోటి రహస్యంగా వ్యభిచరించిన దాన్నే తను చూస్తూ ఎలా పెళ్ళాడటం? అయినా తనని అద్వితీయానందంలో ముంచెత్తిన శశిని తనకి శాశ్వతంగా అర్పిస్తున్న వివాహాన్ని తనెందుకు నిరాకరించాలి? అయితే తనుమాత్రం పవిత్రుడా? ఆ... ఆ ఆ గదిలో తనకి శశి ఎంతో - శశికి తనూ అంతేగద? ఆమె ప్రవర్తన - తను ఇప్పుడు ఆమెని

తిరస్కరిస్తే నేరవౌతుంది. లేకపోతే తామిద్దరమూ ఆరోజు నుండీ దంపతులే. ఇలా ఆలోచించుకున్నాడు అతను.

చంద్రశేఖరం మంగళసూత్రం చేతపట్టుకుని వొంగి పెళ్ళికూతురు మెడలో కట్టబోతూ 'శశీ' అన్నాడు చాలా మెల్లిగా అనుభూతితో.

శశి తలెత్తిచాలా భయంగా అతని కళ్ళల్లోకి చూసింది.

ఆరాత్రి వూరేగింపు జరుగుతోంది. చంద్రశేఖరం దృఢమైన మనస్సుతో మంగళవాయిద్యాల గోలలో ఇంక్వెరికీ వినపడకుండా మంత్రం చదువుతున్నట్టు ''నీ అసలు పేరు అప్పుడే చెబితే, ఈ గడబిడగూడా ఉండేదిగాదు'' అన్నాడు.

''మిమ్మల్ని ముఖాముఖి పెళ్ళి చేసుకోమని అడిగినా ఈ విచిత్రం ఉండేదిగాదు. మా పెద్దలచే మాట్లాడించి పెండ్లి చేయించబట్టే ఇంత బావుంది. అయితే ఇక మీరు నా వంట గదిలో నన్నొదిలి చెడ తిరిగొచ్చి తెల్లవారు ఝామున తలుపు తియ్యమని అరవొచ్చు.'' అంది. శశి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''సుబ్బలక్ష్మిని వంటింటిలోనూ, శశిని పడక మంచం మీదా బంధిస్తాను'' అంటూ చంద్రశేఖరం తన చేతిని ఆమె నడుముకి చుట్టాడు చిరునవ్వు నవ్వి.

*('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)*